

సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 23 । డిసెంబర్ । 2023



జీమారం చర్చికి వందేళ్ల చరిత్ర
కేతేపల్లి మండల పరిధిలోని జీమారం గ్రామంలో గల ఏసుతిరుహృదయ చర్చికి వందేళ్ల చరిత్ర ఉంది. - 8లో



ముప్పన్నా.. ఏదీ కనువిప్పు!
శిథిలావస్థకు చేరిన స్తంభాలు. చేతికందే ఎత్తులో ఉన్న తీగలతో రైతులు భయాందోళన చెందుతున్నారు. - 9లో



ఎంపీల సస్పెన్షన్‌పై నిరసన
పార్లమెంట్‌లో ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. - 9లో

న్యూస్‌రీల్

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరి టౌన్ : ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపకార వేతనాల కోసం వంద శాతం విద్యార్థులు నమోదు చేసుకునేలా ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు తమ బ్యాంకు ఖాతా వివరాలు దరఖాస్తులో నమోదు చేయాలని, హార్డ్ కాపీలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వెబ్‌సైట్ telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్‌యూబీని మూడు నెలల్లో పూర్తిచేస్తాం



ఆలేరులోని రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్ : పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని మూడు నెలల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. ఆలేరు పట్టణంలో ఆర్‌యూబీ పనులు పూర్తి కాకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై 'ఐదేళ్లుగా అసంపూర్తిగానే' శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అధికారులతో కలిసి రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ అశోక్, ఎజాజ్, వెంకటేశ్వర్లు, కూళ్ల నర్సింహులు, సిద్దులు, శ్రీనివాస్‌రెడ్డి, లోకేష్, నీలం పద్మ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 12న 'చలో పార్లమెంట్'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

భువనగిరిటౌన్ : నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఉన్న 16 విద్యార్థి సంఘాలను కలుపుకొని జనవరి 12న చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు తెలిపారు. శుక్రవారం భువనగిరిలో చలో పార్లమెంట్ వాల్ పోస్టర్‌ను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. విద్యారంగాన్ని కాషాయీకరణ చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. జాతీయోద్యమంతో సంబంధం లేని నాయకుల చరిత్రలను పాఠ్యపుస్తకాల్లో పొందుపరుస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షలను నెరవేర్చాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు ఈర్ల రాహుల్, ఉపాధ్యక్షుడు రాయమోజు రమణ, నాయకులు యశ్వంత్, అజయ్, సిద్ధు, మల్లికార్జున్, అభిషేక్ సోహెల్, శివ, పాండు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ప్రజల్లోకి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో భువనగిరి నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేయని పక్షంలో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ కన్వీనర్ అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కిష్టయ్య, బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

• గణిత దినోత్సవం



గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం భువనగిరిలోని సాధన హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

• ముస్తాబైన యాదాద్రి



వైకుంఠ ఏకాదశి సందర్భంగా విద్యుత్ వెలుగుల్లో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం, ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఐలూ మహాసభలను జయప్రదం చేయాలి

రామగిరి(నల్లగొండ) : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) 14వ జాతీయ మహాసభల పోస్టర్‌ను శుక్రవారం నల్లగొండ జిల్లా కోర్టులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐలూ రాష్ట్ర కార్యదర్శి అనంతుల శంకరయ్య మాట్లాడుతూ డిసెంబర్ 28 నుంచి 30 వరకు కోల్‌కతాలో జరిగే ఐలు మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, ఉపాధ్యక్షుడు ఐతగోని లాలయ్య, గుండు వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, తిరుమల శేఖర్, ఎండీ. జబ్బార్, జలందర్, సురేష్, యాదగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే కట్టడి

రాష్ట్రంలో కరోనా కొత్త వేరియంట్ జేఎన్1 కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో వైద్యారోగ్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. కోవిడ్ పరీక్షల కోసం ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ కిట్లను సిద్ధంగా ఉంచాం. పలు ఆస్పత్రుల్లో ఇప్పటికే టెస్టులను ప్రారంభించాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మందస్తు జాగ్రత్తగా మాస్కులు ధరించాలని, భౌతికదూరం పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పరిపూర్ణాచారి హెచ్చరిస్తున్నారు. కరోనా నియంత్రణకు జిల్లా ఆస్పత్రుల్లో చేసిన ఏర్పాట్లపై 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే.. - భువనగిరి

- ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదు
- మాస్క్, భౌతికదూరం తప్పనిసరి
- వైద్యారోగ్య సిబ్బందిని అలర్ట్ చేశాం
- ఆస్పత్రుల్లో ఐసోలేషన్ కేంద్రాలు
- కోవిడ్ టెస్టులు ప్రారంభించాం

'సాక్షి' ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌ఓ పరిపూర్ణాచారి



ప్రస్తుతం కరోనా జేఎన్1 కొత్త వేరియంట్ రూపంలో వ్యాపిస్తుంది. గతంలో డెల్టా రూపంలో వచ్చింది. జేఎన్ 1 సోకిన వారిలో జ్వరం, దగ్గు, జలుబు, గొంతు, తల, కడుపు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. ఈ వైరస్ రోగ నిరోధకశక్తిని ప్రభావితం చేస్తుంది. ఊపిరితిత్తుల్లో సమస్య వచ్చే అవకాశం ఉంటుంది.

ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు

కరోనా కొత్త వేరియంట్ జేఎన్1 కేసు నమోదు అయినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐసోలేషన్ కేంద్రాలను సిద్ధం చేశాం. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 50 పడకలు, బీబీనగర్ ఎయిమ్స్‌లో 50 పడకలు, చౌటుప్పల్, రామన్నపేట, ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 10 పడకలతో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశాం.

ఆక్సిజన్ ప్లాంట్లు,ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ కిట్లు సిద్ధంగా ఉన్నాయి

భువనగిరి, చౌటుప్పల్ ఆస్పత్రులు, బీబీనగర్ ఎయిమ్స్‌లో గతంలోనే ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశాం. ఆలేరు, రామన్నపేట ఆస్పత్రుల్లో బల్క్ ఆక్సిజన్ సిలిండర్లు 20 నుంచి 25 వరకు సిద్ధంగా ఉంచాం. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 300, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 200 చొప్పున ర్యాపిడ్ కిట్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ర్యాపిడ్ కిట్‌లు సిద్ధం చేశాం. వీటితో పాటు ఆర్టీపీసీఆర్ కిట్లు కూడా ఉన్నాయి.

ఇళ్లలో వేడి వాతావరణం ఉండాలి

జేఎన్1 కొత్త వేరియంట్ అత్యంత ప్రమాదకరమైనది కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ, వైద్య నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ వైరస్‌బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పదేళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వ్యక్తులు, గర్భిణులు అత్యవసరమైతే తప్ప.. బయటకు రావద్దు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇంటి లోపల వేడి వాతావరణం ఉండేలా చూసుకోవాలి.

అవసరమైతే గాంధీకి రిఫర్ చేస్తాం

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నాలుగు వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయి. కరోనా సోకిన వ్యక్తులకు శ్వాస సంబంధమైన సమస్య అధికంగా ఉంటే వారిని గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేస్తాం.

21నుంచే టెస్టులు ప్రారంభించాం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈనెల 21నుంచే కోవిడ్ టెస్టులను ప్రారంభించాం. ఇప్పటి వరకు 46 మందికి పరీక్షలు చేశాం. ఎవరికి కూడా కరోనా లక్షణాలు లేవు. క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు, సంక్రాంతి పండుగ నేపథ్యంలో సహజంగానే రద్దీ ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్త వేరియంట్ నేపథ్యంలో జనరద్దీ ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించడంతో పాటు భౌతికదూరం పాటించాలి. ఇప్పటికిప్పుడు ముప్పు లేకున్నా నిర్లక్ష్యం చేయొద్దు.

హామీ నెరవేరేనా?

- భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు నేతల వాగ్దానాలు
- అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా ప్రచారం
- రాష్ట్రంలో, నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు
- కాలేజీ ఏర్పాటుపై చిగురిస్తున్న ఆశలు



భువనగిరి : జిల్లా కేంద్రమైన భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు నోచుకోవడం లేదు. గతంలో పలువురు హామీలు ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. వెరసి డిగ్రీ చదువులకు ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. కొందరు ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశం పొందుతున్నారు. కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు చాలా ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నాయి. ప్రతి ఎన్నికల సమయంలో నాయకులు వాగ్దానాలు చేస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యే అభ్యర్థులు హామీ ఇవ్వడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ప్రజలు ఆశలు పెంచుకున్నారు.

ఏటా 1,200 నుంచి 1,400 మంది అడ్మిషన్

భువనగిరి పట్టణం 1959లో మున్సిపాలిటీగా ఏర్పడింది. 2016లో జిల్లా కేంద్రంగా మారింది. దీంతో పాటు భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గంగా, లోక్‌సభ్ నియోజకవర్గం కేంద్రంగా కూడా ఉంది. ప్రస్తుతం పట్టణంలో మూడు ప్రైవేట్, ఒక ఎయిడెడ్ డిగ్రీ కళాశాల ఉంది. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు చెల్లించవల్సి ఉండగా.. ఎయిడెడ్ కాలేజీలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాని విద్యార్థులు ఫీజు చెల్లించవల్సి ఉంటుంది. ఆయా కళాశాల్లో ప్రతి విద్యాసంవత్సరం 1200 నుంచి 1400 వరకు విద్యార్థులు ప్రవేశం పొందుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు ఆలేరు, రామన్నపేటకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు వెళ్తున్నారు. కొందరు చదువుకు స్వస్తి చెబుతున్నారు.

అన్ని పార్టీల ఎజెండాలో..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ తమ ఎజెండాలో భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసే అంశాన్ని కూడా చేర్చారు. ఎన్నికల్లో గెలిపిస్తే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని విస్తృతంగా ప్రచారం చేశారు. అటు రాష్ట్రంలో, ఇటు భువనగిరి నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై నియోజకవర్గ ప్రజల్లో ఆశలు చిగురుస్తున్నాయి.

మాటకు కట్టుబడి ఉండాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీతో పాటు పీజీ కళాశాల కూడా ఏర్పాటు చేయాలి. భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అనేకమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాం. అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశాం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు చెల్లించి చదవలేకపోతున్నారు. –వనం రాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

హామీ నెరవేర్చకపోతే ఉద్యమం



చెప్పుకోవడానికే భువనగిరి జిల్లా కేంద్రంగా, అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంగా ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదు. కళాశాల ఏర్పాటులో ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో రాజకీయ పార్టీలు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోని పక్షంలో ఆందోళన చేస్తాం. –సుర్వి మణికంఠ, ఏబీవీపీ కన్వీనర్

కనుల పండువగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవోత్సవం చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాథస్వరం వినిపించారు. ఇక ప్రధానాలయంలో ప్రతిష్టా అలంకార మూర్తులకు నిత్య కైంకర్యాలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతసేవ చేపట్టారు. అనంతరం అర్చన, అభిషేకం చేశారు. ఇక ఆలయ ముఖమండపం, ప్రథమ ప్రాకారమండపంలో సుదర్శన హోమం, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం, సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజలు నిర్వహించారు. అదే విధంగా ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉదయం గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించి పాశురాలు పఠించారు.



అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు

అవిశ్వాసానికే మొగ్గు!

రసకందాయంలో భువనగిరి మున్సిపల్ రాజకీయం

- చైర్మన్, వైస్ చైర్మన్‌ను తప్పించేందుకు యత్నాలు
- మరోసారి కలెక్టర్‌ను కలిసి కౌన్సిలర్లు నోటీసు ఇచ్చే అవకాశం
- చైర్మన్ పీఠంపై కన్నేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు దక్కకుండా బీఆర్‌ఎస్, బీజేపీ ప్రయత్నాలు



సాక్షి, యాదాద్రి : భువనగిరి మున్సిపల్ రాజకీయం రసకందాయంలో పడింది. అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసం వైపే మొగ్గు చూపుతున్నారు. త్వరలో మరోసారి కలెక్టర్‌ను కలిసి నోటీసు ఇవ్వనున్నట్లు సమాచారం. చైర్మన్, వైస్ చైర్మన్‌పై అసమ్మతి గళం వినిపిస్తున్న సొంత పార్టీ సభ్యుల్లో (బీఆర్‌ఎస్) పలువురు.. శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరయ్యారు. చివరికి కోరం లేక సమావేశం వాయిదా వేయడం ద్వారా అవిశ్వాస రాజకీయం మరింత వేడెక్కింది. చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యను దించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 7న అప్పటి కలెక్టర్ పమేలా సత్పతికి 19 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసు అందజేసిన విషయం తెలిసిందే.

బీఆర్‌ఎస్ సొంత పార్టీలోనే అసమ్మతి

చైర్మన్ ఎనబోయిన అంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యతో పాటు మరో 18మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై కన్నేసిన సొంత పార్టీలోని ఇద్దరు కౌన్సిలర్లు.. ప్రతిపక్ష సభ్యులతో కలిసి అప్పట్లో అవిశ్వాస తీర్మానంపై సంతకం చేశారు. ఇప్పుడు మరో ఏడుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తోడయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్లను పదవుల్లో నుంచి దించడానికి కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

చైర్మన్ పీఠంపై కాంగ్రెస్ కన్ను

కాంగ్రెస్‌కు 11 మంది సభ్యులు ఉండగా అందులో ఇద్దరు బీఆర్‌ఎస్‌లోకి చేరారు. దీంతో కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం తొమ్మిదికి పడిపోయింది. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టినపక్షంలో పార్టీ మారిన ఇద్దరికి విప్ జారీ చేసే అవకాశం ఉంటుంది. దీంతో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 12కు చేరనుంది.కాంగ్రెస్ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకోవడం లేదా బీఆర్‌ఎస్‌లోని ఆరుగురు సభ్యులను చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక వేళ బీజేపీతో పొత్తు కుదరని పక్షంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను పార్టీలో చేర్చుకొని వారికి వైస్ చైర్మన్ పదవి ఇస్తామని ఒప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు బీఆర్‌ఎస్ నుంచి వచ్చే కౌన్సిలర్లలో ఒకరిద్దరు చైర్మన్ పదవిపై కన్నేసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే కాంగ్రెస్‌లో ఇద్దరు సీనియర్ కౌన్సిలర్లు చైర్మన్ పీఠంపై కన్నేశారు. ఇటీవల ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కౌన్సిలర్ల సమావేశం జరిగింది. చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునే బాధ్యతను కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు అప్పగించారని సమాచారం. ఇందుకోసం చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్న వారిలో ఒకరికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఇస్తామని హామీ ఇవ్వడంతో పోటీనుంచి తప్పుకోవడానికి ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. మరో కౌన్సిలర్ కూడా చైర్మన్ పదవికి పోటీ పడే అవకాశం ఉంది.

బీఆర్‌ఎస్, బీజేపీ పొత్తు!

తాజా పరిణామాల నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకునే అవకాశం ఉండడంతో బీజేపీ చాకచక్యంగా పావులు కదుపుతోంది. బీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు సభ్యులతో బీజేపీ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తమకు చైర్మన్ పదవి ఇస్తే వైస్ చైర్మన్‌కు మద్దతు ఇస్తామని బీజేపీ తన డిమాండ్‌ను బీఆర్‌ఎస్ ముందు పెట్టింది. అయితే మెజార్టీ సభ్యులున్న తమకే చైర్మన్ కావాలని, వైస్ చైర్మన్ మీకే ఇస్తామని ప్రాథమికంగా చర్చించుకున్నట్లు సమాచారం. చైర్మన్ పదవి కాంగ్రెస్‌కు దక్కకుండా చూడాలన్న ఆలోచనతో బీఆర్‌ఎస్, బీజేపీలు ఉన్నట్లు సమాచారం.

చైర్మన్, వైస్ చైర్మన్ రాజీనామా చేయాలి



భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

భువనగిరిటౌన్ : మున్సిపల్ కౌన్సిల్‌లో విశ్వాసం కోల్పోయిన చైర్మన్, వైస్ చైర్మన్‌లు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ కౌన్సిలర్లు శుక్రవారం భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ.. శుక్రవారం నిర్వహించిన భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి సొంత పార్టీ కౌన్సిలర్లే హాజరు కాలేదన్నారు. విశ్వాసం కోల్పోయిన చైర్మన్, వైస్ చైర్మన్‌కు పదవుల్లో కొనసాగే అర్హత లేదన్నారు. సొంత పార్టీతో పాటు విపక్ష సభ్యులను సైతం అవమాన పరుస్తూ, నిర్లక్ష్యంగా, అహంకార ధోరణితో వ్యవహరించారని ఆరోపించారు. ఆత్మగౌరవ పోరాటంలో భాగంగా కౌన్సిలర్లు అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పచ్చల హేమలతాజగన్‌మోహన్, వడిచర్ల లక్ష్మీకృష్ణ యాదవ్, కైరంకొండ వెంకటేష్, ఈరపాక నరసింహ, పడిగెల రేణుక ప్రదీప్, నజీమా సలావుద్దీన్, కాంగ్రెస్‌నాయకులు బర్రె జహంగీర్, కూర వెంకటేష్, ముత్తు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. యాదగిరిగుట్ట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈఓ, వైటీడీఏ వైస్ చైర్మన్, దేవాదాయ శాఖ కమిషనర్ పదవీకాలం ముగిసినా వారిని అప్పటి ప్రభుత్వం విధుల్లో కొనసాగించడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అండ చూసుకొని గీతారెడ్డి, ఆలయ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధిలో నాణ్యత లోపించిందని, అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు.అవినీతిని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్లగా తమకు సమయం ఇవ్వలేదని, దీంతో గవర్నర్, ఉపరాష్ట్రపతికి మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చామని గుర్తు చేశారు. అయినా బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆలయంలో ఇంకా అక్రమాలు పెరిగిపోయాయని వెల్లడించారు. కొండపైకి కార్ల పార్కింగ్‌కు రూ.500 రుసుము విధించారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనను ఎత్తివేయాలని కోరారు.గతంలో మాదిరిగానే చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను కొండపైకి పంపాలన్నారు.ఆలయ ఈఓగా ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, నాయకులు రాయగిరి బాలకిషన్, పాకాలపాటి రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి


సత్యనారాయణ మృతదేహం

బొమ్మలరామారం : తాటి చెట్టు పైనుంచి జారిపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. బొమ్మలరామారం మండలం ఖాజీపేట్ గ్రామానికి చెందిన రాంపల్లి సత్యనారాయణ(54) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సత్యనారాయణ రోజూ మాదిరిగా సత్యనారాయణ శుక్రవారం గ్రామ శివారులో తాటి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో కాలు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పరిసర ప్రాంత రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- రూ.3లక్షల నగదు స్వాధీనం

తొర్రూరు: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రూ.3లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో డీఎస్పీ వెంకటేశ్వరబాబు శుక్రవారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన మీసాల రవి తొర్రూరు పట్టణానికి చెందిన మాదేటి సూర్యారావు ఇంట్లో 4 నెలలుగా కేర్ టేకర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 18న ఖమ్మంలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి ఇంటి యజమాని సూర్యారావు, అతని భార్య వెంకటరాజ్యలక్ష్మి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన కేర్ టేకర్ రవి ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి బీరువా తెరిచి అందులోని రూ.3లక్షలు అపహరించాడు. అదే రోజు రాత్రి సూర్యారావు దంపతులు ఇంటికి వచ్చి చూసి డబ్బులు మాయమైనట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. క్లూస్ టీం సాయంతో విచారణ చేపట్టారు. ఇంట్లో పని చేసే రవిని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. అతన్ని అదుపులోకి తీసుకుని డబ్బు స్వాధీనం చేసుకోవడంతోపాటు కేసు నమోదు చేశారు.

ఇరువర్గాల ఘర్షణ.. పలువురికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: ఇరువర్గాల ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈఘటన యాదగిరిగుట్ట మండలం మైలార్‌గూడెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మైలార్‌గూడెం గ్రామానికి చెందిన జీడిపల్లి బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సుధాకర్‌తో పాటు బండి సాయిలు, బండి రాజు వ్యవసాయ భూముల వద్ద గడ్డి వాము గురించి ఘర్షణ పడ్డారు. దీంతో ఒకరినొకరు గొడ్డలి, కర్రలతో దాడి చేసుకోవడంతో గాయాలయ్యాయి. ఇరువర్గాల వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రాయపురంలోని పునీత రాయప్పచర్చి


కేతేపల్లిలోని జపమాలమాత ప్రార్థనాలయం


ఇనుపాములలోని సెయింట్‌పాల్స్ చర్చి

బీమారం చర్చికి వందేళ్ల చరిత్ర

- నాడు పూరిపాకలో ప్రారంభమైన ఏసుతిరుహృదయ ప్రార్థనాలయం.. నేడు తెలంగాణలోనే ప్రసిద్ధి
- ఎత్తైన గోపురాలతో సర్వాంగ సుందరంగా నిర్మాణం
- యేటా క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు.. వైభవంగా క్రిస్మస్ వేడుకలు
- పర్వదినానికి ముస్తాబవుతున్న కేతేపల్లి మండల ప్రార్థనాలయాలు


బీమారంలోని ఏసుతిరుహృదయ చర్చి

కేతేపల్లి: క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబవుతున్నాయి. కేతేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏసుక్రీస్తు జీవిత ఘట్టాలను పేర్కొంటూ నిర్మించిన చర్చిలు క్రైస్తవుల ఆధ్యాత్మిక కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. ఇక్కడి చర్చిలలో ఏటా జరిగే వేడుకల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మతగురువులు, మతకన్యలు వందల సంఖ్యలో హాజరవుతారు. కేతేపల్లి మండలంలోని బీమారం గ్రామంలో గల ఏసుతిరుహృదయ చర్చికి వందేళ్ల చరిత్ర ఉంది. వంద సంవత్సరాల క్రితమే బీమారంలో క్రైస్తవ సంఘం ఏర్పాటైంది. 1900లో ఉమ్మడి ఏపీలోని గుంటూరు, బాపట్ల, తెనాలి తదితర ప్రాంతాల నుంచి క్రైస్తవులు భీమారం గ్రామానికి వలస వచ్చారు. ఇక్కడి నల్లరేగడి భూములను కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటూ ఇక్కడే స్థిరపడ్డారు. కొంతమంది క్రైస్తవులు ఒక పూరి గుడిసెను ఏర్పాటు చేసుకుని ప్రార్థనలు చేసేవారు. ఓ చిన్న పూరిపాకలో ప్రార్థనాలయంగా ఉన్న ఈ చర్చి ప్రసుత్తం తెలంగాణ జిల్లాల్లో ఎంతో ప్రసిద్ధి గాంచింది. 1902వ సంవత్సరంలో నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో తొలి విచారణను భీమారంలో ప్రారంభించారు. ఆ సమయంలోనే ఎత్తయిన గోపురాలతో సర్వాంగ సుందరంగా నిర్మాణాలు చేపట్టి 1905 సంవత్సరంలో ఏసు తిరుహృదయ చర్చిని పూర్తి చేశారు.

జపమాలమాత మందిరం

కేతేపల్లిలోని 65 నంబరు జాతీయ రహదారి పక్కనే ఉన్న మేరీ జపమాలమాత మందిరానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. ఈ చర్చిలో ప్రతి ఏడాది జనవరి 5,6,7 తేదీల్లో క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. వందల ఏళ్ల క్రితం నుంచే ఇక్కడ క్రైస్తవులు చిన్న దేవాలయాన్ని నిర్మించుకుని ప్రార్థనలు చేసేవారు. 1956లో రాతి కట్టడంతో భారీ చర్చిని నిర్మించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ తదితర పట్టణాలకు వెళ్లే భక్తులు తమ వాహనాలను ఇక్కడ ఆపుకుని ఏసుక్రీస్తుకు, మేరీమాతకు ప్రార్థనలు చేస్తారు. హుండీలో కానుకలు వేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది క్రిస్మస్ వేడుకలకు చర్చిని అందంగా అలంకరిస్తున్నారు.

పునీత రాయప్ప చర్చి

మండలంలోని రాయపురం గ్రామంలో 2008లో పునీతరాయప్ప చర్చిని నిర్మించారు. ఇటలీకి చెందిన ఫాదర్ జోసెఫ్ రొమానో గ్రామంలో స్థిరపడి పరిసర ప్రాంతాల్లో క్రీస్తు బోధనలు వివరిస్తూ క్రైస్తవ సంఘాన్ని బలోపేతం చేశారు. క్రైస్తవ మతాధిపతి పోప్‌పాల్ చేత పూజ చేయించిన రాయితో రాయపురంలో చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇటలీ, అమెరికన్ ఆర్కిటెక్చర్‌ల శిల్పకళా సాదర్యంతో రాతిబండపై ఇక్కడి చర్చిని అత్యాధునికంగా నిర్మించారు. ఇటలీ ఫాదర్ రొమానో క్రైస్తవ ప్రజలకు చేసిన సేవలకు గుర్తుగా ఆయన మృతదేహాన్ని చర్చిలోనే సమాధి చేశారు. అలాగే మండలంలోని ఇనుపాములలో నూతనంగా నిర్మించిన సెయింట్‌పాల్స్ చర్చిలో ప్రతి ఏడాది క్రిస్మస్ ఉత్సవాలతో పాటు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

ఇందిరమ్మ కాలనీలో రెండిళ్లలో చోరీ

- రూ.50 వేల నగదు, 3తులాల బంగారం అపహరణ
- దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

మిర్యాలగూడ అర్బన్: పట్టపగలే దుండగులు తెగబడ్డారు. తాళాలు వేసిన రెండు ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారు ఆభరణాలను అపహరించారు. దొంగలు చోరీకి పాల్పడుతుండగా అప్రమత్తమైన స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిర్యాలగూడలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీకి చెందిన కె.నగేష్ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా గురువారం ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లిపోయాడు. గమనించిన ఇద్దరు దొంగలు నగేష్ ఇంటి తాళాన్ని గడ్డపారతో పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. గమనించిన కాలనీ వాసులు ఇంటిని చుట్టిముట్టి పోలీసులకు సమాచారం అందించారు. ఈలోగా బయటకు వచ్చిన దొంగలు పారిపోయేందుకు ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. ఇంతలో పోలీసులు రావడంతో ఇద్దరు దొంగలను వారికి అప్పగించారు. కాగా ఇదే కాలనీలో దినసరి కూలీగా పని చేసే శారద ఇంట్లో తులం బంగారంతో పాటు నగేష్ ఇంట్లో రూ.50వేల నగదు, 2తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యా దు మేరకు నిందుతులపై కేసు నమోదు చేశామని, పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ తెలిపారు.

లైంగికదాడి కేసులో 20ఏళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): మైనర్‌పై లైంగికదాడి చేసి గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు కోర్టు జడ్జి తిరుపతి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా.. సూర్యాపేట జిల్లాకు చెందిన భార్యభర్తలు తమ ఇద్దరు కూతుళ్లతో కలిసి నల్లగొండ మున్సిపాలిటీ పరిధి ఆర్జాలబావి గ్రామంలో నివాసముంటున్నారు. భర్త కూలీగా భార్య ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సెంట్రింగ్ పని చేసే చిట్యాలకు చెందిన నిజాముద్దీన్ అలియాస్ నిజ్జు వీరి ఇంటి పక్కనే అద్దెకుండేవాడు. బాలికకు చాక్లెట్లు కొనిస్తూ, సెల్ ఫోన్ చూపిస్తూ అసభ్యంగా ప్రవర్తించే వాడు. గమనించిన బాలిక తల్లిదండ్రులు ఇల్లు ఖాళీ చేసి వేరే చోట కిరాయి తీసుకున్నారు. అయినప్పటికీ నిజాముద్దీన్ తన బుద్ధి మార్చుకోకుండా తల్లిదండ్రులు లేని సమయంలో బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పొద్దని బాలికను బెదిరించాడు. కొంత కాలానికి కడుపునొప్పి వస్తోందని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వైద్యులను సంప్రదించగా గర్భవతి అని చెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులు 2022 డిసెంబర్ 19న నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిజాముద్దీన్‌పై ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరిగిరి వెంకట్‌రెడ్డి వాదనలతో ఏకీభవించిన జడ్జి బి.తిరుపతి నిందుడికి ఐపీసీ సెక్షన్ 376(ఏబి), 376(2)(ఎన్), పోక్సో చట్టం 2012 కింద 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అదే విధంగా మరో ఐపీసీ సెక్షన్ 448,506ల కింద ఏడాది జైలు, రూ. వెయ్యి జరిమానా విధించారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు నష్టపరిహారం, నిందితుడు రూ.60 వేలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. నిందుడికి కఠిన శిక్షపడేలా పని చేసిన కోర్టు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, టూటౌన్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరిగిరి వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ శీలం సురేష్‌ను ఎస్పీ అపూర్వరావు ప్రత్యేకంగా అభినందించారు. నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వారిని సన్మానించారు.


అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మట్టపల్లిలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం


ఆలయంలో క్యూలైన్లను పరిశీలిస్తున్న ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను శుక్రవారం ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్‌లు అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం తెల్లవారుజామున 5.30గంటలకు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు ఉత్తరద్వార దర్శనం ఇస్తారని తెలిపారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిదంగా ఆలయ ఆవరణలో మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామాచార్యులు తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం


జానయ్య (ఫైల్)

మాడుగులపల్లి : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మాడుగులపల్లి మండలం చెరువుపల్లి గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెరువుపల్లి గ్రామానికి చెందిన మద్దెల జానయ్య (43) భవన నిర్మాణ కార్మికుడు. అతడికి భార్య, పదకొండేళ్లలోపు ఇద్దరు ఆడ పిల్లలున్నారు. జానయ్య కొంతకాలంగా పనిలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఈ నెల 20న (గురువారం) మధ్యాహ్నం గ్రామశివారులో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి 11 గంటలకు మృతిచెందాడు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న బాలుడు మృతి


ఐషిత్ (ఫైల్)

కనగల్: చలిమంట వేసుకుంటుండగా శానిటైజర్ డబ్బా పేలి గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కనగల్ మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన బుట్టి శంకర్, సంధ్యల కుటుంబం కొంతకాలంగా నల్లగొండలోని 25వ వార్డులో నివాసం ఉంటోంది. వీరి కుమారుడు ఐషిత్(12) వారం రోజుల క్రితం నల్లగొండలోని తమ అద్దె ఇంటి ఎదుట చలిమంట వేసుకునే క్రమంలో శానిటైజర్ లిక్విడ్‌కు మంట అంటుకుని డబ్బా పేలింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఐషిత్‌ను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఐషిత్ నల్లగొండలోని ఓ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. చికిత్సకు రూ.8లక్షలు ఖర్చు చేసినా కుమారుడు దక్కలేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఐషిత్ కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి ఓదార్చారు. మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపిన వారిలో సర్పంచ్ గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్ రెడ్డి, చిలకరాజు వెంకన్న తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

భువనగిరి క్రైం : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి మండల పరిధిలోని వీరవెల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వీరవెల్లి గ్రామానికి చెందిన బాత్కూరు విజయ్ రెడ్డి (30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతను కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంటికి రాకుండా తిరుగుతుండడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన విజయ్‌రెడ్డి ఇంటి నుంచి వెళ్లి రాయగిరి సమీపంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించే సరికే విగతజీవుడిగా మారాడు. మృతుడి తండ్రి పద్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

జగ్గారెడ్డిగూడెంలో బాలిక అదృశ్యం

తిప్పర్తి: మండలంలోని జగ్గారెడ్డిగూడేనికి చెందిన ఓ బాలిక అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగ్గారెడ్డిగూడెం గ్రామానికి చెందిన భాషపాక మల్లమ్మ కుమార్తె కీర్తి ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 19న కీర్తి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మల్లమ్మ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మా తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


జగన్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. మిర్యాలగూడ, గరిడేపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన జగన్ యాదవ్ (35) మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలోని యాదవుల బజారులో గల రైస్‌మిల్లును లీజుకు తీసుకుని నడిపిస్తున్నాడు. జగన్ రోజూ మాదిరిగానే శుక్రవారం రాత్రి మిల్లు బంద్ చేసి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. తడకమళ్ల గ్రామ శివారుకు వెళ్లగానే ఇతడి బైక్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జగన్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

గరిడేపల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌కు చెందిన బంటు శ్రీకాంత్(35) పని నిమిత్తం గురువారం బైక్‌పై మిర్యాలగూడ వెళ్లాడు. తిరిగి హుజూర్‌నగర్ వస్తున్న క్రమంలో కీతవారిగూడెం గ్రామ బస్టాండ్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడిపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


సౌమ్యను సత్కరిస్తున్న హెచ్ఎం శ్రీనివాస్‌రావు


నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సిరికొండ సౌమ్య రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నల్లగొండ జిల్లా దేవరకొండలో జరిగిన జోనల్ స్థాయి కబడ్డీ పోటీలో సౌమ్య ప్రతిభను కనబరిచి అండర్ -14 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సౌమ్యను ఘనంగా సత్కరించారు. త్వరలో జనగామ జిల్లాలో జరిగే రాష్ట స్థాయి పోటీల్లో సౌమ్య పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హుస్సేన్, రాఘవారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్యాంకుమార్, గోపయ్య, యాదయ్య, యాస్మీన్ ఉన్నారు.

యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

భువనగిరిటౌన్ : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, అన్ని ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. యువతకు పెద్దపీట వేసి ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు బుగ్గ నవీన్ గడ్డం వెంకటేష్, దయ్యాల మల్లేష్,ఎండి సలీం, బోనగిరి గణేష్, రత్నం శ్రీకాంత్, వడ్డేమాన్ విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదాద్రిలో ముక్కోటి వేడుక

- ఉదయం 6.42గంటలకు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమివ్వనున్న స్వామివారు
- అనంతరం అధ్యయనోత్సవాలకు శ్రీకారం
- ఆరు రోజుల పాటు నిత్యకల్యాణం, హోమం రద్దు


యాదాద్రి దేవస్థానం ఉత్తర రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన గ్రిల్స్


అధికారులతో మాట్లాడుతున్న ఈఓ రామకృష్ణారావు

యాదగిరిగుట్ట: ముక్కోటి ఏకాదశి వేడుకకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం ముస్తాబైంది. వేడుకకు వచ్చే భక్తులకు ఆలయ ఉత్తర మహా రాజగోపురం ద్వారం నుంచి వైకుంఠనాథుడి అలంకరణలో యాదాద్రీశుడు భక్తులకు దర్శనం ఇచ్చే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా రానున్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ మాఢ వీధుల్లో ఇనుప గ్రిల్స్‌ను బిగించారు. కోవిడ్ కొత్త వెరియంట్ వస్తున్న నేపథ్యంలో భక్తులు మాస్కులు ధరించి రావాలని సూచిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉదయం 6.42గంటలకు ద్వారా దర్శనం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం ఉదయం 3గంటలకే ఆలయాన్ని తెరువనున్నారు. 3నుంచి 3.30గంటల వరకు సుప్రభాతం నిర్వహించనున్నారు. 3.30 నుంచి 4గంటల వరకు ప్రాతఃకాల తిరువారాధన, 4 నుంచి 4.30 గంటల వరకు తిరుప్పావై సేవకాలం, 4.30 నుంచి 5.15 గంటల వరకు బాలభోగం, ఆరగింపు, 5.30 నుంచి 6.30గంటల వరకు స్వామి వారిని అలంకరిస్తారు. 6.42గంటలకు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారు దర్శనం ఇస్తారు. 8గంటల వరకు ఉత్తర ద్వారం వద్దనే స్వామి వారిని వేంచేపు చేస్తారు. 8 నుంచి 8.45 గంటల వరకు తిరువీధి సేవ, 7.30 నుంచి 8.15 గంటల వరకు స్వామివారికి నిజాభిషేకం, 8.15 నుంచి 8.45 గంటల వరకు సహస్రనామార్చన, 8.45 నుంచి 11గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి. 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు బ్రేక్ దర్శనాలను కొనసాగిస్తారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 12.30 గంటల వరకు సర్వ దర్శనాలు, 12.30గంటల నుంచి 1.30గంటల వరకు స్వామి వారికి మధ్యాహ్న రాజభోగం, 1.30గంటల నుంచి ఆలయంలో యథావిధిగా నిత్య కైంకర్యాలు జరుగుతాయి.

పాతగుట్ట ఆలయంలో..

ముక్కోటి ఏకాదశి సందర్భంగా యాదాద్రికి అనుబంధ ఆలయమైన శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని వేకువజామున 4గంటలకు తెరుస్తారు. 4గంటల నుంచి 4.30వరకు సుప్రభాతం, 4.30 నుంచి 5 గంటల వరకు ఆరాధన, 5 నుంచి 5.45గంటల వరకు సేవాకాలం జరిపిస్తారు. 5.45 నుంచి 6.30 వరకు స్వామి వారి సేవ అలంకరణ, 6.42గంటల నుంచి 7.20 వరకు ఉత్తర ద్వార దర్శనం, 7.20 గంటలకు స్వామి వారి సేవ పురవీధుల్లో ఊరేగింపు, 8గంటల నుంచి స్వామి అలంకార సేవ దర్శనం, 8గంటల నుంచి 8.30 వరకు స్వామి వారికి నిజాభిషేకం, 8.35గంటల నుంచి నిత్య కైంకర్యాలు కొనసాగిస్తారు.

భక్తులు మాస్కులు ధరించి రావాలి

ముక్కోటి ఏకాదశి సందర్భంగా యాదాద్రి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వామివారిని ఉత్తర ద్వారం వద్ద ఉదయం 6.42గంటలకు భక్తులు దర్శించుకునేలా సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం కోవిడ్ కొత్త వెరియంట్ వస్తున్న నేపథ్యంలో భక్తులు మాస్కులు ధరించి రావాలి. శనివారం అధ్యయనోత్సవాలకు సైతం శ్రీకారం చుడుతున్నాం. ఆరు రోజుల పాటు నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం వంటి పూజలను రద్దు చేశాం.

– రామకృష్ణారావు, ఆలయ ఈఓ

నిత్య కల్యాణం, హోమం రద్దు

స్వామి వారి అధ్యయనోత్సవాలను 23వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరిపించనున్నారు. ఈ ఆరు రోజులు స్వామి వారి విశేష అలంకార సేవలు ఉన్న నేపథ్యంలో ఆలయంలో భక్తులచే నిర్వహించే నిత్య, శాశ్వత కల్యాణం ,శ్రీసుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవాలు, జోడు సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు. వీటితో పాటు ఏకాదశి పర్వదినం 23వ తేదీన లక్ష పుష్పార్చన కైంకర్యం, అర్జిత నిజాభిషేకం, సహస్ర నామార్చన సైతం రద్దు చేశామని పేర్కొన్నారు.